# 6 దాతృత్వం

సాయంత్రం మొదలూ కుంభవోతగా పడే వర్షం రాత్రి పదకొండింటికి కాని ఆగలేదు; వాతావరణం ప్రాణానికి హాయిగా వున్నా, తన ఇల్లు కాకపోవటంవల్లా, ఎంత వీలైతే అంత త్వరగా కొంప జేరుదామనే ఆతృతవల్లా వెంకటేశ్వర్లుకు చాలా బాధాకరంగా వుంది. అందులోనూ ఆరు నూరైనా తిష్టవేసి, ఎలాగైనా యీ బాకీ వసూలు చేయందే ఇంటికి పో కూడదనే పట్టుదల అతని ఇతర సుఖాలన్నిటినీ దిగమింగింది. ఒక వైపు నిరశన వ్రతానికైనా సిద్ధపడాలనే భావం అతనిలో వుంది కాని, సుష్టుగా భోజనం చేశాక మొదలెడితే బాగుంటుందనే అభిప్రాయమూ వుంది.

చివరకు యీ మొండి బాకీ వసూలవగానే తను పడిన ఆవేద నంతట్నీ క్షణంలో మరిచిపొయ్యా డతను. ఐదువొందల రూపాయిలూ చొక్కా లోపలి జేబులో పెట్టుకొని, అణాస్టాంపు రశీదు పారేసి త్వరగా బైటపడ్డాడు.

బజార్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నవి. వాననీరు గలగలలాడుతూ రోడ్డు మీద పరుగులు తీస్తోంది. ఆ నిర్మలోదకం అరికాళ్ళను రాచుకుంటూ చక్కిలిగిలి పెడుతోంది. కుక్కలు సైతం, ఏ అరుగుమూలలనో ముడుచుకొని పడుకున్నవి. కొంచెం దూరం నడిచాక, తాను ఒంటరిగా నడుస్తున్న భావన కలిగిం దతనికి. ఎలక్ట్రిక్ లైటు కాంతిలో తనకు ముందుగా పడిన నీడను చూసి భయపడ్డాడు. ఇది తన నీడేనని తెలుసుకొని కుదుట పడ్డాడు; యీ నీడ తనకు కాస్సేపు ముందూ, కాస్సేపు వెనుకా నడుస్తోంది.

యీ అర్ధరాత్రి చలిలో, ఒంటరిగా బైటికిరావటం అనాలోచితమే ననిపించిం దతనికి. కాని, అక్కడ ఆ బాకీదారుని ఇంట్లో యీ పైకం జేబులో పెట్టుకొని ఏ అరుగుమీదో పడుకోవటం ఎలా? అందులోనూ

వాడితో ఎంతో ఘర్షణ పడ్డాడాయె! తను ఎంత దీనంగా, జాలిగా చెప్పినా, తన బాకీ పారేసేందుకు ఇష్టంలేక, నానా తిట్లూ తిట్టీ, చివరకు విసిగి, డబ్బు పారేశాడు. యీ పరిస్థితుల్లో తాను సాధించిన విజయాన్ని శత్రువు ఇంటి లోనే నిద్రింప జేయటం ఏం సబబు? అలా అని, ఇప్పుడు తను అంతకన్న తక్కువ ఘోరమైన పరిస్థితుల్లో వున్నాడా?

జార్జిటౌన్ నుంచి సైదాపేటలోని తన యింట్లోకి వెళ్ళి, తలుపులు బిడాయించుకొని, లోపల తాళాలు వేసుకొనేదాకా తాను సురక్షితుడు కాదు మరి. ఒకపక్క ఆకలి దహించి వేస్తోంది. కొంప జేరుతే ఆ చద్దికూడే అమృతప్రాయంగా అరగించ వొచ్చు....కొంప జేరాక, ప్రళయం వొచ్చినా తనకు దిగులు లేదు. ఐతే ఎట్లా?

బీదవాళ్ళను కరుణించి పొద్దుగూకులూ పరుగెత్తే ఎలక్ట్రిక్ రైళ్లూ, బస్సులూ విశ్రాంతి తీసుకుంటూన్నవి. మళ్ళీ ఏ తెల్లవారుజామునోకాని తిరగ నారంభించవు. తను ఇంటిదాకా నడవటమా?....

ఎనిమిది మైళ్ళన్నా వుంటుంది. యీ స్థితిలో ఆ ఎనిమిదికి పక్కన ఒకటి కాదు, రెండు సున్నాలు వున్నట్లే తోచిం దతనికి. వెంకటేశ్వర్లు ఇన్‌కమ్‌టాక్స్ కట్టకపోయినా, నెల కొక ఐదారు వొందలు సంపాయిస్తూనే వున్నాడు. ఐనప్పటికీ తన చుట్టూ వున్న వాళ్ళను, తను బీదవాడేనని నమ్మించటంలో ఎప్పుడూ ఎక్కువ శ్రద్ధ తీసుకుంటూనే వున్నాడు. లోకం పాపిష్టిది కనుక, జాగ్రతలు వహించవలసిన అవసరం ఏర్పడిం దతనికి.... ఇక యీ సమయంలో నిజంగా తాను బీదవాడనే నమ్మకం, తనకే కుదిరింది.

కొన్ని సుఖాలను త్యాగం చేస్తేనే తప్ప సంపాదనలో కొంత నిలవ తేలదు; నిలవను చూసుకొని పొందే ఆత్మతృప్తి లాటిదాన్నే డబ్బు ఖర్చు పెట్టి సుఖపడుతూన్నవారు పొందివుంటారు. యీ రెంటిలోనూ మొదటి పద్ధతే తనకు నచ్చింది. ఏ పరిస్థితుల్లోనూ అనాలోచితంగా ఒక్క దమ్మిడీ కూడా ఖర్చు చేయడు తను. ఇప్పుడు కొంప జేరేందుకు చాలా డబ్బు ఖర్చుచేయాల్సి వుంటుందనే ఆలోచన అతన్ని భయపెట్టింది.

కేవలం తన నీడ సహాయంతో నడవట మనేది అసంభవం. తను కోరకుండానే అడ్డంగా తెగ పెరిగిన యీ శరీరం, ఎవరిదో అన్నంత

భారంగా వుంది; దీన్ని వొదిలించుకోలేడు కనుక భరించాల్సిందే! తన జేబులో ఐదొందల రూపాయిలు ఉన్నవనే మాట జ్ఞాపకం రాగానే హఠాత్తుగా తుళ్ళి పడ్డాడు. ఇది వాసన పట్టి, తన నెవరూ తరమటం లేదు కదా? చప్పున వెనక్కి తిరిగి చూసి, ఎవరూ వెంటాడటం లేదని నిర్ధారణ చేసుకొని కుడిచేత్తో జేబు తడివి చూసుకొని తృప్తిపడ్డాడు.

వందలమందిని వ్యాపారంలో మోసంచేయటం తెలికే కాని, ఒక్కడితో పోరాడగలగటం, గెలవటం కలలోకూడా తన తలకు మించిందనే సంగతి, వెంకటేశ్వర్లుకు తెలుసు. అందులోనూ శరీరాన్ని పెంచటమే కాని, చెడగొట్టుకోవటం తనకు బొత్తిగా ఇష్టంలేదు. యీ బొందితో స్వర్గానికి జేరేలోగా ఇంకో లక్షన్నా సంపాయించి తన ఐశ్వర్యాన్ని రెండింతలు చేయటం తన జీవితాశయం.

పోతే ఇప్పుడు తన జేబులోవున్న పైకం బుట్టలో వున్న విషసర్పం లాటిది. ఎవరైనా వొచ్చి ఆ బుట్ట తెరుస్తే, అది ముందుగా తననే కాటు వేస్తుంది. అందుకని యీ పైకాన్ని పారెయ్యలేడు; ఇది సంపాయించేందుకేగా నానా గడ్డీ కరుస్తోంది? ప్రకృతి శక్తులు మినహా, మిగతా ప్రపంచమంతా డబ్బనే యీ తాటిమీదనేగా నడుస్తోంది? ఒక విధంగా చూస్తే యీ డబ్బే తనను సుఖంగా సురక్షితంగా కొంపజేర్చగలదు కూడాను....

వెంకటేశ్వర్లు బ్రాడ్వే సెంటర్‌కు వొచ్చాడు. మహా పట్టణమంతా నిద్రపోతూన్నట్లు వుంది. చిత్రమేమంటే పగలు ఇసుకవేస్తే రాలనంత జనం తిరుగులాడే ఈ చైనాబజారు రోడ్డులో, రాత్రి పదయ్యేప్పటికే జనం అంతగా కనిపించరు. అంటే ఎవ రిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు. ఇతర జనం లాగే తనూ ఇంటికి జేరాలనే కదా వెంకటేశ్వర్లు తీవ్రంగా ఆలోచిస్తోంది.

టాక్సీ వేసుకుందామా అనుకున్నాడు....టాక్సీ! తన జీవితపు స్థాయికి కలలోనన్నా టాక్సీ ఎక్కలేడు! (మైలుకో రూపాయన్నా వుంటుంది; అప్పటికి బేబీ టాక్సీలు రాలేదింకా). ఈ అర్ధరాత్రి మీటర్ లెక్కలో బాడుగకు ఎవడొస్తాడు? అందులోనూ తన మొహం చూస్తే పది రూపాయిలు తక్కువ అడగడు. అటూ ఇటూ చూస్తే, ఒకే ఒక్క టాక్సీ వుంది....ఇంకేం వీణ్ని కదుపుతే తను అనుకున్నదాని కన్న చాలా ఎక్కువ అడుగుతాడు; కనుక ఈ వాహనం లాభంలేదు.

ఆటోరిక్షా ఐతే కాస్త తక్కువలో వొస్తుంది; అదీగాక త్వరగా జేరగలడు; కాని అది ఎక్కడా కనిపించటంలేదు.

మిగిలినవి రిక్షాలు. రెండు లాగుడు రిక్షాలూ, నాలుగు సైకిల్ రిక్షాలు మాత్రం ఉన్నవి. వీళ్ళతో బేరం పెట్టక తప్పేదిలేదు. సెంట్రల్ దాకా నడుస్తే కొంచెం చౌకగా వాహనమేదన్నా దొరుకుతుందేమో కానీ, ఈ స్థితిలో నడవలేడు. దారిలో ఎక్కడన్నా ఏదన్నా దుకాణం వుంటే ఆకలి మంట తీర్చుకోవా లనుకున్నాడు కాని, ఈ వాన రాత్రి, అర్ధరాత్రి దాకా వెంకటేశ్వర్లనే ఒక మహాకాయుడు ఆరగించేందుకు వొస్తాడని తెలిస్తే మాత్రం, ఎవడు దుకాణం తెరుచుకొని కూర్చుంటాడు?

రిక్షావాళ్ళను కదిపాడు; లాగుడు రిక్షా లాభంలేదు. సైకిల్ రిక్షాయే బాగుంటుంది. ఇద్దరు గాఢనిద్రలో వుండి, అసలు లేవనే లేదు. మిగతా ఇద్దర్లో ఒకడు ఐదురూపాయలు అడిగాడు.

వెంకటేశ్వర్లుకు గుండె ఆగింత పనైంది.ఐదు రూపాయిల కాగితం కళ్ళముందాడింది. మరో ఐదు గంటల్లో ఎలాగూ, బస్సులూ, ఎలక్ట్రిక్ రైళ్ళూ బయలుదేరుతవి. అంటే ఈ కాలం గంటకు ఒక రూపాయి విలువన్న మాట! వెధవకాలం-గంటకు అణా ఇచ్చేవాడుంటే తెల్లవార్లూ మేలుకోడూ తను?

చూద్దామని బేరం పెట్టాడు. చివరకు నాలుగు రూపాయిలన్నా లేందే రాను పొమ్మన్నాడు ఒకడు; రెండోవాడు మాట్లాడలేదు. సమయం వొచ్చినప్పుడు యీ రిక్షా వాళ్ళందరూ ఒకే మాటమీద వుంటారు. ఇంత కన్న నిలువు దోపిడి వుంటుందా అనిపించింది. ప్రజలను రక్షించే పోలీసులందరూ ఏమయ్యారు? అరాచికం ప్రారంభమైనట్లే తోచిం దతనికి.... కాని తనేం చేయగలడు?

రూపాయి ఇస్తా నన్నాడు వెంకటేశ్వర్లు. మొదటివాడు తుపుక్కున రోడ్డుమీద ఉమ్మేసి, తన భీకర రూపానికి భయపడినవాడల్లే, రిక్షాను తీసుకొని కాస్త అవతలికి వెళ్ళాడు. రెండోవాడు మాట్లాడలేదు.

మొదటివాడు చూపిన అవమానానికి అతనికి మండిపోయింది; కాని ఏం చేస్తాడు? ఆ కోపంతో నాలుగడుగులు ముందుకు వేశాడు! కాని ఎవరూ

తనను పిలవలేదు. ఈ అలకవల్ల తనకే నష్టం. ఐతే ఐం దనుకుందామా, కరకు రూపాయిలు వొదిలించుకోవాలి.

'పోనీ ఫోర్టు స్టేషన్‌కు వెళ్ళి పడివుంటే' అనుకున్నాడు కాని, ఐదు గంటలసేపు ఆకలి బాధతో కూర్చోవటం మాటలా? అలా కూర్చున్నా కళ్ళు తెరిచి వుండగానే తన భార్యా, ఇద్దరు పిల్లలూ, చిల్లర దుకాణం, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని తన భార్య ఎదురుచూస్తూండటం, ఇవన్నీ పీడకలలల్లే కళ్ళముందు వేళ్ళాడుతూంటవి.

మరీ తన కొంప చాలా ఓటిది. అందులోనే వ్యాపారం; కాపరమూను. ఏళ్ళ తరబడిగా వుంటున్నాడు కనుక పాతిక రూపాయిలకే పెద్ద ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఇక ఆ సందు, చీకటి గుయ్యారంగా వుంటుంది. వారం రోజుల క్రితం తన ఇంటికి ఐదిళ్ళవతల ప్రొహిబిషన్ వాళ్ళు సారా పట్టుకున్నారు. ప్రొహిబిషన్ వుంది కనుక తాగినవాడు తందనా లాడేందుకు భయపడతాడు కాని, తాగిన వాణ్ని నమ్మటం ఎలా?

పదిహేను రోజులక్రితం తన యింటికి ఎదురుగా వ్యభిచార చట్టం కింద ఇద్దరు అమ్మాయిల్ని, ఇద్దరు మొగాళ్ళనూ, ఇద్దరు ముసలాళ్ళనూ పట్టుకొని పొయ్యారు. ఆ కొంప చూస్తే ఏ ఐశ్వర్యవంతుల్దో, ఏ మర్యాదస్తుల్దో అనిపిస్తుంది! కాని లోపల జరిగే వ్యాపారం ఇదీ!

ఆ నవయువతుల్ని చూసి, ఇలాటి రంభల్ని ఏ అదృష్టవంతుడు పెళ్ళాడుతాడోనని లొట్టలు వేశాడు తను. క్షణంసేపు మతిపోయినట్లయి, తన జీవితమంతా ఎడారే ననిపించింది; కాని యీ ఇహలోక సుఖాల్నిగూర్చి తలచటంలో తను శ్రద్ధ చూపివుంటే ధనవంతుడు అవలేక పొయ్యేవాడు. పోతే, తనేమీ అన్యాయాలు చెయ్యడనే నమ్మకం వుంది కనుక, రేపు స్వర్గంలో తనను ఆహ్వానించే రంభా ఊర్వశులు ఎలా వుంటారో ఈ నవయువతుల్ని చూస్తే అర్థమైంది.

తన కొంప వున్న సందు అంత మంచిదికాదు. సందు చివర అంతా అలగాజనం; కనుకనే తన వ్యాపారం మూడు కాయలూ, ఆరు పువ్వులుగా సాగుతోంది. ఐతే తనిలా డబ్బు సంపాయించటం చాలా మందికి కన్నెర్రగానే వుంది. తను ఎంత బీదవాడుగా నటించినా. తానేమీ అనుభవించక

పోయినా, ఓర్వలేని వాళ్ళు చాలామంది ఉన్నారు, వీళ్ళెవర్నీ తను లెక్క-చేయటం లేదు కాని, వాళ్ళుమాత్రం తనమీద ఒక కన్నువేసే వుంచారనే అనుమానం చాలా కాలంగా పీడిస్తోంది. సమయం చూసి, తన కొంపమీద పడి దోచుకుంటే!

ఈ తలపు రాగానే వెంకటేశ్వర్లు వొణికిపోయ్యాడు. తన భార్యా, పిల్లలూ భయపడి ఇంటి పెంకులు ఎగిరేట్లుగా ఏడుస్తూన్నట్లే వినిపించింది....ఆ దుర్మార్గులు యింట్లో వున్నదంతా దోచుకుంటున్నట్లే అనిపించింది....

కొంచెం ఆలోచించి వొణుకు తగ్గించుకున్నాడు. ఎందుకంటే మొదటినుంచీ తను అంతా తెలివిగా ఆలోచించే బతుకుతున్నాడు. ఇంట్లో వెండి బంగారాలు లేవు. భార్య మెడలో మంగళసూత్రం ఒక్కటే బంగారం; అన్నాలు తినే కంచాలన్నీ అల్యూమినియం బొచ్చెలు; తను ఇంత హీనంగా బతకటంలో భార్యకూడా సహకరిస్తూనే వుంది; కనుకనే డబ్బు కూడబెట్ట గలిగాడు. ఆశ్చర్యం ఏమంటే జీవితాన్ని అనుభవించని తనను చూసి, యీ ప్రజలు జాలిపడాల్సిందిపోయి, తనంటే ఈర్ష్య పడతారెందుకు?

పోతే ఇంట్లో నగదు ఏమంత లేదు. అన్నీ ప్రోనోట్లూ, దస్తావేజులూను. బాంకులో వేస్తే ఎవరికైనా తెలుస్తుంది. డబ్బు వడ్డీలకు తిప్పటం, ఇల్లు కొనటంలో వినియోగించాడు, తను సంపాదించిన లాభాలన్నీ జార్జి టౌన్‌లోవున్న బ్రహ్మాండమైన మేడలోని గోడల్లో, దర్వాజాల్లో ఉన్నది. ఇలా చేయకుంటే ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసే తనకు చాలా కాలం నివాసమయ్యేది. ధన సంపాదన ఒక కళ అని ఎవరన్నా అంటే, సంపాయించింది జాగ్రత్తపడి, దాచి, పెంచటం ఒక కళ అని తను అనగలడు. మొదటిది చాలామందికి తెలిసిన కళయితే, రెండోది ఏదో తనబోటి కొద్దిమందికి మాత్రమే తెలిసిందని రుజూ చేయగలడుకూడాను.

దొంగతనం జరిగినా, పెద్దగా పొయ్యేది లేదు కాని, ఆ అవకాశం మాత్రం ఎందు కివ్వాలి? చూస్తూ చూస్తూ నడి సముద్రంలోకి విసిరి వేసేం

దుకు తనదేం నడమంత్రపు సిరికాదు; కరెన్సీ అచ్చుకొట్టి సంపాయించిందీ కాదు; రోజులోని ప్రతి నిమిషమూ కష్టపడి, చమటోడ్చి, కడుపు మాడ్చు కొని సంపాయించింది మరి! ఇరవై ఏళ్ళ క్రితం కట్టు గుడ్డల్తో యీ మహా పట్టణానికి వొచ్చి, యీనాడు యీ స్థితికి వొచ్చాడంటే, తన సామర్థ్యానికి ఇంతకన్న రుజూ లేం కావాలి? తను ఎంత కష్టపడుతున్నాడో తెలుస్తే తనను చూసి ఈర్ష్య పడేవాళ్ళు అకారణంగా, అన్యాయంగా ఏర్పరుచుకున్న అభిప్రాయాలను మార్చుకుంటారు.

జీవితంలో అవసరాల్ని కూడా విలాసాలుగానే పరిగణిస్తున్నాడు తను; అత్యవసరాల్ని సాధారణ అవసరాలుగా గుర్తిస్తున్నాడు. లేకుంటే పర్వతంలావున్న మేడను అద్దెకిచ్చి ఆ ఓటికొంపలో ఎందుకుంటాడు? టాక్సీ వేసుకొని పోకుండా యీ స్థితిలో, చెప్పులన్నా లేని కాళ్ళను, బరువుగా ఎత్తి ఎత్తి వేస్తూ ఎందుకు ముందుకు సాగుతాడు? మడతలు చెరగని ఇస్త్రీ దుస్తు లెప్పుడన్నా ధరించాడా తను? యీ విలాసా లున్నవే, ఇవే మనిషిని నానా అవస్థలపాలూ చేస్తవని తనకు తెలుసు. డబ్బుతోపాటే విలాసాలు తనను ఆహ్వానించక పోలేదు. ఐతే వాటిని కసిరి, దూరానికి తరిమేశాడు.

ఇంట్లో తన సంసారం తనలాగే బాధపడుతూ వుంటుంధి. వాళ్ళకూ రక్షణ కావాలి. మొగాడంటూ ఒకడు యింట్లో వుంటే ధైర్యం; అంత కన్న తనకూ, తన జేబులోవున్న యీ ఐదొందలకూ ధైర్యం....

రతన్‌బజార్ దాటుతూండగా గంట వాయించుకుంటూ సైకిల్‌రిక్షా వొస్తోంది. వెంకటేశ్వర్లు ఆగి వెనక్కు చూసి అది ఖాళీగానే వున్నందు వల్ల, ఇందాకటి వెధవే రూపాయికి ఒప్పుకొని వొస్తున్నా డనిపించింది.... వెధవ గీర్వాణం కాకపోతే, అప్పుడే ఒప్పుకోరాదూ—తన కీ ఫర్లాంగూ నడక తప్పేది! రూపాయంటే, పదిహారు అణాలని మరిచిపోయి ఉంటాడు —వెధవ! అందుకనే కూటికి మాడుతూ ఇన్ని అవస్థలూ పడుతున్నారు వీళ్ళు....

తీరా రిక్షా దగ్గిరికి వొచ్చాక చూస్తే, వాడు మొదటివాడు కాదు; మెదలకుండా వూరుకున్న రెండోవాడు. వీడు కుర్రాడల్లే కనిపించాడు;

మైనారిటీ వెళ్ళిందో లేదో—ఐనా తను వీడిచేతేం నోటు రాయించటం లేదుగా?

"స్వామీ! నేను వొస్తాను—" అన్నాడు వాడు, రిక్షా ఆపుతూ.

వీడు తెలుగువా డైనందుకు వెంకటేశ్వర్లుకు కాస్త సంతోషమైంది. ఆంధ్రాభిమానం చూపగలడు కాని డబ్బు విషయంలో మాత్రం కాదు.

"రూపాయి ఇస్తాను—అంతే!" అన్నాడు వెంకటేశ్వర్లు.

"అలా సెలవిస్తే ఏం చెయ్యను చెప్పండి....ఎనిమిది మైళ్ళన్నా వుంటుందా? రెండన్నా ఇప్పించండి...."

ఎర్రరంగు రెండు రూపాయిల నోటు కళ్ళముం దాడింది వెంకటేశ్వర్లుకు. ప్రాణం వొప్పటం లేదు. రెండు రూపాయిలు న్యాయమేనని అంతరాత్మ ఘోషిస్తూ వుంటే,దాని పీకె నొక్కేశా డతను.అంతరాత్మలు ఆరోగ్యకరంగా వుంటే ఇన్ని అవినీతులు జరక్క పోవొచ్చేమోకాని, అవినీతులు జరగందే ప్రపంచం ముందుకు సాగేందుకూ వీల్లేదు మరి.

"సరే....రూపాయిన్నర ఇస్తాను....అంతకన్న దమ్మిడీ కూడా ఇవ్వను—" అని ఇదే తన నిశ్చితాభిప్రాయమని సూచించేందుకు వెంకటేశ్వర్లు రెం డడుగులు ముందుకు వేశాడు.

"రండి....రండి...." అన్నా డా కుర్రాడు చాలా ఆతృతతో.

వెంకటేశ్వర్లు రిక్షా ఎక్కి హాయిగా, ఠీవిగా కూర్చున్నాడు. రిక్షా కదిలింది-మెల్లిగా; వానకు తడిసి వున్నదేమో. ఛైను బిరుసెక్కింది. ఆ కుర్రాడు పెడల్స్‌మీద లేచి నిలబడ్డా రిక్షా కదిలే స్థితిలో లేదు. నరాలు బిగపట్టి, కండరాల్ని సమీకరించి నానా అవస్థా పడుతూంటే, చీమ నడకతో రికా సాగుతోంది.

'ఛస్తున్నాడు వెధవ!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు. 'డబ్బు ఉట్టి డియంగా వొస్తుందా మరి!....' యీ వెధవ రిక్షా యీ వేగంతో ఐతే తను సూర్యోదయానిక్కాని కొంప జేరలేదు....రూపాయిన్నర ఖర్చుపెట్టి, సూర్యోదయానికి జేరటం అర్థం లేనిపని. నడుస్తే ఇంతకన్న ముందుగా జేరవొచ్చుకాని నడిచే ఓపిక లేదు.

చల్లగాలికి ప్రాణం హాయిగా వుంది. కడుపులో కూడా ఏమన్నా

పడితే బాగుండు. తను పీనాసి అని అనుకునే వాళ్ళెవరన్నా ఇప్పుడు తనను చూస్తే తెలిసేది మరి. వాళ్ళ సంగతి ఎలా వున్నా, యీ రిక్షావాడు మాత్రం ఎముకలు విరగ్గొట్టుకుంటున్నాడు.

'పాపం!' అనిపించింది వెంకటేశ్వర్లుకు. తన బరువూ, సైకిల్‌రిక్షా బరువూ, వాడి బరువూ లాగాలాయె మరి! జాలివేసింది కాని, తనేం చేయ గలడూ? తొందరగా పోనిమ్మని ఆజ్ఞాపించలేక పొయ్యాడు; తనలాటి తొందరే వాడికీ వుండివుంటుందని తోచిం దతనికి.

జనరల్ హాస్పిటల్ దగ్గిరి బ్రిడ్జి ఎక్కటం మాటలా? రిక్షావాడు దిగి, నడిపిస్తున్నాడు. ఎగుడులో వొదిలిపెడతాడేమోనని భయం వేసింది అతనికి; ఇది జరుగుతే సరాసరి సెంట్రల్ స్టేషన్ థర్డ్‌క్లాస్ వెయిటింగ్‌హాల్ పక్క నుంచి దూసుకొనిపోయి, ఇనప కటకటాలను గుద్దుకోవటమే....పోనీ దిగు దామా అనిపించింది కాని, డబ్బిచ్చి తద్దినం కొని తెచ్చుకోవటానికి మన సొప్పలేదు....నానా అవస్థాపడి బ్రిడ్జి ఎక్కింది....రిక్షావాడు దర్జాగా సీటు మీద కూర్చొన్నాడు. బండికి శరవేగం వొచ్చింది; దిగుడాయె మరి! ఇంత వేగంగా బండిపోవటం ఇష్టంలే దతనికి. ఏమన్నా ప్రమాదం జరుగుతుం దేమోనని భయం....ఆపమందా మనుకున్నాడు....కాని ఒకపక్క తను త్వరగా వెళ్ళాలనీ వుంది. అట్లాగే ప్రాణాలు బిగపట్టుకొని కూర్చున్నాడు.

మౌంట్‌రోడ్ బ్రిడ్జిదాకా తొక్కకుండానే పరుగెత్తింది. రిక్షాకుర్రాడి దర్జా చూసి, తను అనవసరంగా డబ్బిస్తున్నట్లనిపించింది వెంకటేశ్వర్లుకు. ....మళ్ళీ వొంతెన ఎక్కించేందుకు రిక్షావాడు దిగాడు. ఇది ఎక్కితే మరి కొంతదూరం దా నంతటదే వెళ్తుంది. కష్టే ఫలే అన్న సామెతను ప్రతి వొంతెనా జ్ఞాపకం చేసి, అమలు జరుపుతూనే వుంటుంది.

మౌంట్‌రోడ్డు దాటుతోంది; రిక్షావాడుకూడా కాస్త ఉత్సాహంగా వున్నాడు; వెళ్ళవలసిన దూరం తరుగుతూన్నకొద్దీ మనస్సు తేలికవుతూనే వుంటుంది కదా! కాని తన బరువు తగ్గదు; అందుకనే వాడు అటూ ఇటూ వొంగుతూ, తన బలమంతా ఉపయోగిస్తున్నాడు....'చావనీ' అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వానకు తడిసి వుండటంవల్ల పై

దీపాలు తమాషాగా రోడ్డుమీద తమ పాపల్ని చూసుకుంటూన్నవి. ఇంత చల్లగాలి వేస్తుంటే యీ రిక్షావాడు చెమటలు కక్కుతున్నాడు. ఊపిరి పీల్చటం, విడవటం, అల్లంత దూరాన వున్న రైలు ఇంజన్ భుగభుగల్ని గుర్తుచేస్తోంది.

రిక్షావాడితో నన్నా మాట్లాడితే తప్ప ఈ నిశ్శబ్దం భరించరానిదిగా తోచి "ఒరేయ్ అబ్బాయీ! నీ పేరేమిటి?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"సుబ్బడండీ—" అన్నాడు వాడు, ఆయాసపడుతూనే.

"రిక్షాకు అద్దె ఎంతరా?"

"రాత్రికి రూపాయి, పగలు రూపాయిన్నారా అండీ!"

కొన్నాళ్ళ క్రితం ఒకమిత్రుడు రిక్షాలు అద్దెకిచ్చే వ్యాపారం చేయమని సలహా ఇచ్చాడు. ఇప్పుడు వెంకటేశ్వర్లు లాభాలు కట్టటంలో నిమగ్నుడయ్యాడు. రోజుకు రెండున్నరంటే, నెలకు డబ్భై ఐదు........సంవత్సరానికి తొమ్మిదొందలు....రిక్షా మహావుంటే ఆరొందలు....సంవత్సరం తిరిగేప్పటికి నూటికి యాభై వొంతుల లాభం, రిక్షా మిగులుతుంది. నాలుగు రిక్షాలు పెట్టుకొని చూడొచ్చు. వడ్డీ వ్యాపారంకన్న ఇదే లాభసాటి. అప్పిచ్చిన డబ్బు వసూలయ్యేదాకా అనుమానమే కదా! వడ్డీ ధర్మానికి ఇస్తూన్నట్లు బాధపడే వాళ్ళూ, లేకుంటే కోర్టు చుట్టూ తిప్పేవాళ్ళూ, వీళ్ళ పీడ మరి వుండదు. తనడబ్బు ఎప్పుడూ తన కళ్ళముందే రిక్షాల రూపంలో వుంటుంది. పదిమందికి ఇంత అన్నం పెట్టిన పుణ్యంకూడా తనకు దక్కుతుంది. వెంకటేశ్వర్లు లెక్కల్లో, అందులోనూ డబ్బులెక్కల్లో నిధి.... ఈ వ్యాపారమంతా ఒక్కసారి కళ్ళముందు కట్టి, సంవత్సరం తిరిగేప్పటికి వెయ్యి రూపాయిల మూట వొంతున కళ్ళముందు మెరవసాగింది.

ఒకపక్క బుర్ర ఇంత తీవ్రంగా ఆలోచిస్తూ వున్నా, కళ్ళు మాత్రం రోడ్డు రెండు వైపులా ఏవన్నా తినుబండారాలు దొరుకుతయ్యేమో నని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉన్నవి.

చివరకు థౌజండ్‌లైట్స్‌లోకి వొచ్చేప్పటికి ఒక చిన్న టీ కొట్టు తెరిచివుంది. వెంటనే రిక్షా ఆపించాడు వెంకటేశ్వర్లు. ఏమన్నా కాస్త తిని, కాస్త టీ అన్నా తాగకపోతే ప్రాణం నిలిచేట్లులేదు. ఇంకా నాలుగుమైళ్లన్నా వెళ్ళాలి. ఈ రిక్షా వెళ్ళే వేగం చూస్తే మరో గంటకు పైగా పడుతుంది.

ఈ ఉద్దేశ్యంతో రిక్షా దిగి "ఉండు....ఇప్పుడే వొస్తాను" అన్నాడు.

రిక్షా కుర్రాడు నురుగులు కక్కుతున్నాడు; మాసిన చొక్కా పెట్టి మొహం మీదినుంచి కారే చెమట తుడుచుకున్నాడు. నోరుకూడా తెరిచి గాలి పీలుస్తున్నాడు; జవాబుచెప్పే శక్తికూడా లేనట్లుంది. తనలాగే వీడుకూడా ఆకలితో దహించుకొని పోతున్నా డనిపించింది, వెంకటేశ్వర్లుకు. వాడిమీద జాలి వేసింది; వాణ్ణికూడా ఏమన్నా తిందా మందామా అని నోటిదాకా వొచ్చింది కాని, డబ్బుతోకూడిన వ్యవహారం కనుక, వెంటనే మాన వత్వాన్ని ఉపసంహరించుకున్నాడు.

గబగబా హోటల్‌లో దూరాడు; అది మహమ్మదీయులది. ఏమన్నా తిందామంటే, మాంసం, గీంసం వుంటుందేమోనని భయం. వెంకటేశ్వర్లు కేవలం శాకాహారి! చివరకు బిస్కెట్లుకూడా తిన బుద్ధికాలేదు; అందులో కూడా కాస్తోకూస్తో అది కలుస్తుందేమోననే అనుమానం ఒకపక్కా, ఎటూ ఇంకో గంటలో భోం చేస్తాడు కనుక, డబ్బులు దండగెందుకనే హెచ్చ రిక మరోపక్కా కలిసి, ఒక్క అణా డబ్బుల్తో టీ మాత్రం తాగించేట్లు చేసినయ్....టీ తాగంగానే కొత్త శక్తీ, ఉత్సాహమూ వొచ్చినట్లు తోచింది. వొచ్చి బరువుగా రిక్షాలో కూలబడ్డాడు.

రిక్షావాడు ఒక్కసారి దీనంగా, జాలిగా చూశాడు వెంకటేశ్వర్లువైపు. వెంకటేశ్వర్లు ఆ చూపుకు అదరిపొయ్యాడు. ఆ చూపులు చాలా నిశితం గానూ, మర్మగర్భితంగానూ వుండి అతన్ని బాధించినవి. భరించలేక వేరొక దిక్కు చూశాడు.

రిక్షా కదిలింది. జేబులో లవంగం మొగ్గ వుంటే. నోట్లో వేసుకొని కసిక్కున కొరికాడు వెంకటేశ్వర్లు. నాలిక చుర్రుమంది; కోపంవొచ్చి తుపుక్కున ఉమ్మేశాడు....ఈ వెధవ రిక్షా ఇంత మెల్లిగా నడుస్తుందేం అని పించింది. ఇంతకన్న మరి గతిలేదు కనుక, వూరుకున్నాడు.

తేనాంపేట సమీపిస్తూ వుండగా వెంకటేశ్వర్లుకు భయం వేసింది. అటూ ఇటూ గుబురుగా పెరిగిన చెట్లు; నిర్జీవంగా నిద్రపోతూన్న భవనాలు, దూరదూరంగా వున్నవి; కీచురాతి శబ్దాలు మాత్రం వినిపిస్తూన్నవి. తలలు విరియబోసుకొన్న దెయ్యాలల్లే వున్న పెద్దచెట్లు, నీటిచుక్కల్ని రాలుస్తున్నవి.

ఈ చీకట్లోనుంచి, ఏ దొంగల ముఠా అన్నా హఠాత్తుగా మీద పడితే....? రిక్షా వాడికేం భయం? రిక్షాకూడా వాడిది కాదాయె! తన జేబులో వున్న డబ్బుకాస్తా గుంజుకుంటే! ఎక్కడో మూలల్లో తనకోసం వేచి కూర్చున్న దొంగ లున్నారేమో నని చాలా పరిశీలనగా చూశాడు కాని, ఏమీ కనిపించటంలేదు....ఏమో—తనకు కనిపించకుండా కూర్చున్నా రేమో?

ఆ మధ్య యెక్కడో పత్రికలో అర్ధరాత్రి ఒంటరిగా పొయ్యేజనాన్ని ఆపి, దోచుకొన్న సంఘటనల్ని గూర్చి చదివాడు. వెంకటేశ్వర్లు పత్రికలు కొని చదువుతాడని మీ రెవరన్నా అనుకుంటే, కాస్త పరాగ్గా వున్నారని హెచ్చరించవలసి వుంటుంది....పొట్లాలకుగాను వొచ్చిన పత్రికల్లో చది వాడు....ఆ చదివింది ఇప్పుడు తనకే వర్తిస్తుందేమో నవే భయం కమ్మింది.

డబ్బు ఖర్చవుతుందని భయపడ్డాడు కాని, ఆ టాక్సీ వేసుకుంటే బాగుండేది. కారైతే అరగంట ముందే కొంప చేరేవాడు; ఏ దొంగా కారు ఆపగలిగి ఉండేవాడు కాదు. తన జేబులో డబ్బూ, ప్రాణం, తాను అత్యధి కంగా ప్రేమించే స్వశరీరం, కుటుంబం—అంతా చాలా సురక్షితంగా ఉండేవి....

ఇప్పుడు ఎవడైనా ఎదురై, చాకు చూపితే!.... మెదలకుండా జేబులు దులపటమే! కాని యీ లోపలే వాడు ఆ చాకు, బానలాటి తన పొట్టలో గుచ్చితే! బొళ బొళా కారే ఎర్రని, చిక్కని నెత్తురుతో తన ముందున్న రోడ్డు పారాణి పెట్టుకుంటుంది!

ఛీ....ఛీ....ఏమిటీ తలపులు? అర్థంలేని వూహ లనుకొని సరిపెట్టు కోవా లనుకున్నాడు కాని, కుదరటంలేదు. ఎవరి దాకానో ఏమిటి? ఈ రిక్షావాడే, మరికొంత దూరం లాక్కువెళ్ళి, చాకుతీసి జేబులు దులపమంటే? అసలు ఆ ఉద్దేశ్యంతోనే వీడు రూపాయిన్నరకే వొప్పుకున్నాడేమో? ఐ ఉండొచ్చు....పోను ఎనిమిదీ, రాను ఎనిమిది మైళ్ళూ పదహారు మైళ్ళ ప్రయాణానికి రూపాయిన్నరంటే, మైలుకు అణన్నరా? ఈ చౌకబేరం వెనుక, దుర్మార్గంకూడా వుండి వుంటుందనే నమ్మకం కలిగిం దతనికి.

పక్కలోనే చాకు పెట్టుకొని నిద్రిస్తున్న వాడి స్థితిలో పడ్డాడు వెంక

ఉేశ్వర్లు. ఈ కుర్ర వెధవ ఏమైనా చేసేట్లయితే, తను వీడితో పోట్లాడి గెలవగలడా, లేదా అని ఆలోచించాడు....కాని యీ మహాకాయంతో పోట్లాడటంకన్న వెంటనే ఓటమిని అంగీకరించటం ఉభయులకూ శ్రేయస్కరం. కోర్టుకెక్కి పోట్లాడటమైతే అతను చాలా నిశ్చింతగా ఉండేవాడు....అక్కడైతే న్యాయం, ధర్మం, పోలీసులూ తన సుఖ సౌఖ్యాలను గారంటీ చేస్తూ, సాధ్యమైనంతవరకూ రక్షణ ఇస్తారు. కాని ఇక్కడో? తను ఒంటరివాడు. న్యాయాన్యాయ విచక్షణలు లేవు. అడవిలో బతికే జంతువులు ఎలా బతకగలవో, అదే విధానం అమలు జరుగుతుంది. మనిషికూడా జంతువుకన్న ఏవిధంగానూ గొప్పవాడు కానేరడని మరోసారి రుజూ అవుతుంది; ఐతే యీ పరిశోధనలో తను దెబ్బతింటాడు. వీడితో పోట్లాడగలిగినా, వాడు చాకుతీస్తే లాభంలేదు. మిగిలిందల్లా రేపు రిపోర్టివ్వటమే.... పేరు సుబ్బడని చెప్పాడు. ఎడ్రస్ ఏమిటో? ఈ వెధవలకు ఎడ్రస్కూడా వుంటుందా? వీడి రూపురేఖా విలాసాలను జాగ్రత్తగా గుర్తు చేసుకుంటున్నాడు వెంకటేశ్వర్లు.

ఎంత ఖర్మ వొచ్చిందీ! ఇప్పుడు నిజంగానే తనను ఎవరైనా దోచుకుంటే, త నేమీ చేయలేడు; వాళ్ళు దయదలిచి తన డబ్బు ఎంత వొదిలినా, అదంతా వూరికనే వొచ్చినట్లవుతుంది. పది రూపాయలు టాక్సీకి పారేస్తే, మిగిలిందంతా తనదే అయ్యేది కదా! పొరపాటు చేసిం తర్వాత జ్ఞానోదయమై ఏంలాభం? ఆ చేసిన తప్పుకు ఏదో వొక రూపంలో జరిమానా చెల్లించాల్సిందే; కాని యీ రూపం 'డబ్బు' కావటంవల్లా, డబ్బుకూ తన ప్రాణానికీ వున్న లంకె వేధిస్తోంది....

రిక్షావాడు ఆహారంమీద ఆపేక్షతో వాలే గద్దల్లే హేండిల్‌బార్ మీదికి వొంగాడు; కాళ్ళమీద లేచి నిలబడుతున్నాడు. కటకటలాడుతూ మెల్లిగా నడుస్తోంది, రిక్షా. వీడికి యీపాటికి కాళ్ళు చచ్చుబడి వుండాలి. శ్వాస అందక గుంజుకుంటున్నాడు. ఈ స్థితిలో వీడు తనమీద తిరగబడగలడా? ఏమో....ఇంకా స్త దూరం, ఆ కనిపించే అడవి పక్కనుంచి వెళ్తూండగా వీడో, లేక ఇంకా ఎవరన్నానో తనమీదికి ఉరుకుతారని ఎందుకనో చాలా అనుమానంగా వుంది. మద్రాసువంటి పట్నంలో అడవుల్నీ, ఎడారుల్నీ, పులుల్నీ, సింహాల్నీ చూడగలుగుతున్నాడు వెంకటేశ్వర్లు.

తను అనుమానించిన అడివి రానే వొచ్చింది. రిక్షా ఆగింది. కుర్రాడు దిగుతున్నాడు. వెంకటేశ్వర్లు శరీరోష్ణం మినహాగా. చలిజ్వరపు రోగిగా మారాడు. వాడింక చాకు తీయిటం, తనొక్క నమస్కారంచేసి జేబు దులపటం....యీ పీడకల ఇంతతోనన్నా అంతరిస్తే బాగుండు నని పిస్తోంది.

కుర్రాడు కాళ్ళు యీడ్చుకుంటూ పేవ్‌మెంట్‌మీద కూర్చున్నాడు. స్టీమ్ ఎక్కువైనప్పుడు ఇంజన్ విడిచే మాదిరిగా బుసలు కొడుతున్నాడు. వెంకటేశ్వర్లుకు అంతా అగమ్యగోచరంగా వుంది. వాడు అలుపు తీర్చుకొని తనమీదికి దూకుతాడేమో? యీలోగానే తను ధైర్యంచేసి, వీణ్నొక మొత్తు మొత్తుతే మంచిదేమో? కొట్టినవాణ్నే కొట్టే ధైర్యంలేదు తనకు....ఏం చేయాలి? దగ్గిరికివెళ్తే....వాడు చాకు తీస్తే?

వాడు అలుపు తీర్చుకుంటూనే నేల కొరిగాడు. కుర్ర వెధవ ఊపిరందక ఢామ్మిన చచ్చాడేమో? ఇదే నిజమైతే, వెంకటేశ్వర్లు ఊహించింది, జరిగిందాంట్లో ఒక చిన్న భాగమే అవుతుంది....తను యీ అర్ధరాత్రి, శవాన్ని పెట్టుకొని కూర్చోవటం....భూత ప్రేతాలూ, దెయ్యాలూ తనచుట్టూ వేయికంఠాలు మేళవింపజేస్తూ, భరతనాట్యం ఆరంభవిస్తవి. చెవులు మూసుకున్నా ఆ శబ్దం వినపడకుండా ఉండదు; కళ్ళు మూసుకున్నా కనిపించక మానదు, అందులోనూ శవమంటే వెంకటేశ్వర్లుకు చచ్చే భయం, శవ జాగరణ సంగతి ఎలా వున్నా, ఈ హఠాన్మరణానికి తను సంజాయిషీ చెప్పటం, పోలీసులచుట్టూ తిరగటం, అనుమానంమీద కొద్దిరోజులు వాళ్ళు జైల్లో ఉంచటం జరిగినా జరగొచ్చు.

దొంగలభయం పోయి, వీడు చచ్చాడేమోననే భయం పీడిస్తోంది వెంకటేశ్వర్లును. వీణ్ణి బతికుండగా తను భరించలేకపొయ్యాడు; చచ్చి అంతకు రెట్టింపు బరువయ్యేట్లున్నాడు....అసలు చావలేదేమో?....మరి అలా వెల్లకిలా పడిపోయి, కదలక మెదలక వుంటే అర్ధమేమిటి? తను యీ ఆలోచనల్తో ఇక్కడ కాలం వృధా చేస్తున్నాడు.

మరి గత్యంతరంలేక, రిక్షా దిగి వాడి దగ్గిరికి వెళ్ళాడు. వాణికే చేతుల్తో వాణ్ని అటూ, ఇటూ కదిపి చూశాడు. "ఊఁ. ఆఁ." అని మూలిగాడు వాడు. బతికే వున్నందుకు తను అదృష్టవంతు ణ్ననుకున్నాడు వెంకటే

శ్వర్లు, మూర్ఛపోయి వుంటాడు. మొహాన ఇన్ని నీళ్ళు చల్లేందుకు, దగ్గర్లో నీళ్ళు లేవు.

వీణ్ని యీ స్థితిలో వొదిలేసి వెళ్తే? వాడి చావు వాడు ఛస్తాడు కాని, తను ఇంటికి జేరటం మా పేమిటి?ఇంకా మూడు మైళ్ళన్నా వుంది.అదీగాక వొప్పుకున్న బాడుగ ఇవ్వని అన్యాయానికి తాను పాల్పడలేడు. స్వర్గ నర కాలమీద బాగా నమ్మకమున్న తను, మరి ఏంచెయ్యాలి? ఈ రిక్షా త నొక్కడే తొక్కుకుపోతే? చిన్నతనంలో సైకిల్ నేర్చుకున్నాడు తను. ఐనా బాలెన్స్ నిలపవలసిన పనిలేదు కనుక, దీన్ని తొక్కటం ఒక గొప్ప కాదు. కాని వీణ్నిక్కడే కాకులకూ, గద్దలకూ వొదలి తనొక్కడూ రిక్షా తొక్కుకు పోతే, మళ్ళీ అది వీడికి అప్పజెప్పటం ఎలా? యీ యక్ష ప్రశ్నల్ని ఆలోచించటంకన్న, ముందు ఎంత త్వరగా ఇక్కణ్ణుంచి కదు లితే, అంత క్షేమం.

రిక్షావాణ్ణి దయదల్చి కాకపోయినా, తనమీద తనకే జాలివేయటం వల్ల, వెంకటేశ్వర్లు ఆ కుర్రాణ్ని మెల్లిగా ఎత్తి రిక్షాలో కూర్చోబెట్టాడు; ఎంత బరువు వెధవ! వాడు ఒకపక్కకు ఒరిగి ఏటవాలుగా పడుకున్నాడు. వీడింక కదలడనే నమ్మకం కలిగిం దతనికి.

వెంకటేశ్వర్లు పంచె పైకి కట్టి, సీటుమీద కూలబడ్డాడు; పెడల్స్ మీద కాళ్ళతో వొత్తాడు. కటకటమంటూ గొలుసు కదిలింది; రిక్షా సాగింది. కాని బలంగా తొక్కితేనేకాని పోవటంలేదు. తను ముందుకు తొక్కుతుంటే బిగుసుకున్న గొలుసు వెనక్కు లాగుతోంది.

వూపిరి బిగపట్టి తొక్క నారంభించాడు వెంకటేశ్వర్లు. గొలుసు తెగిపోవటం లాటి ప్రమాదంకన్న, ఇది తక్కువదిగానే తోచింది ప్రస్తుతానికి. ఒకపక్క భయం-రోడ్డుకు రెండువైపులావున్న చెట్లనీడలు కూడా అతన్ని వొణికిస్తున్నవి. మరోపక్క ఆకలి బాధ. యీ చాకిరీ చేయాల్సి వొస్తుం దనుకుంటే, ఆ హోటల్లో రెండు బిస్కట్లన్నా తినే వాడు. మధ్య మధ్య ఈ కుర్రవెధవ కింద పడ్డాడేమోనని వెనక్కు చూస్తూనే వున్నాడు. వాడు రిక్షాను గట్టిగా కరుచుకొని అలాగే పడివున్నాడు.

ఇందాకటినుంచీ వెనక కూర్చున్నాడు కనుక తెలియలేదు కాని, ఈ రిక్షా తొక్కటం ఎంత కష్టమో, ఇప్పుడు బాగా తెలుస్తోంది. ఇందాక రిక్షా

వాడు నాలుగు రూపాయిలు అడిగినందుకు, వాణ్ని బందిపోటు దొంగల్లే భావించిన మాట నిజమే కాని, ఇప్పుడు చూస్తే నాలుగూ ఇవ్వటం చాలా న్యాయమనిపిస్తోంది....తనే-రిక్షావాడైతేనా, పది రూపాయలు తక్కువ అడిగేవాడు కాదు!

రూపాయిన్నరకు ఈ కుర్రవెధవను ఒప్పింపచేయటం దురన్యాయ మనే సంగతి ఈ క్షణంలో వెంకటేశ్వర్లుకు కళ్ళకు కట్టినట్లయింది. పాపం —వీడికి శోషొచ్చి, దాహంతో గొంతు తడి ఆరి పడిపొయ్యాడు. వీలున్నా తనను దోచుకునే దురుద్దేశం వీడికి లేదు. వీడు మెత్తనివాడు కావటంవల్ల, తను మొత్తేందుకు ప్రయత్నించటం తనకు తెలియకుండానే జరిగింది. ఈ వెధవపని ఇంత కష్ట మనిపించలేదు. ఏదో యంత్రం కనుక, దొర్లిపోతుం దనుకున్నాడు; కాదు-కేవలం యంత్రంలాగే ఈ రిక్షావాడుకూడా కదులు తూంటే అలాగే అనిపించింది. ఈ కష్టానికి ఎంత తింటే సరిపోను?

ఎంత తొక్కినా దూరం తరగటంలేదు. ఒకపక్క ఆతృత, ఇంకే దన్నా ప్రమాదం జరుగుతుందేమోనని మనసు పీకుతూనే వుంది. ఎవరో తనను చంపేందుకే వెన్నాడుతూన్నట్లు సర్వశక్తుల్నీ వినియోగించి పలా యనం చేస్తున్నట్లే వుంది అతనికి.

తిరుపతి వెంకటేశ్వరస్వామిని మనసులో ధ్యానించుకున్నాడు; అసలు తను ఆ పేరు పెట్టుకోవటంలోనూ, ఇతరులచేత అలా పిలిపించు కోవటంలోనూ తన భక్తి తత్పరత కనిపిస్తూనే వుంది. ఏ ప్రమాదమూ లేకుండా కొంప జేరితే, చిన్నవాడి పుట్టిన వెంట్రుకలు తిరుపతి కొండమీద తీయించాలని నిశ్చయించుకున్నాడు. వెంట్రుకల్తో తృప్తిపడే దేవుడు కను కనే, బీదకూ బక్కకే కాకుండా, తనలాటివాళ్ళకూడా ఆయనంటే భక్తి ఎక్కువ!

కష్టాల్లో పడ్డప్పుడు ఎంత కఠినుడికైనా మనసు ద్రవిస్తుంది, ఐతే ఈ జాలి తనమీదనే కాకుండా, పక్క వాళ్ళమీది కూడా ప్రసరిస్తుంది. అందులోనూ త నిప్పుడు అనుభవ పూర్వకంగా ఈ కష్టాన్ని గూర్చి తెలుసుకున్నాడు కనుక, దీనికి న్యాయమైన కూలి ఇవ్వా లనిపించింది.... వాడు మళ్ళీ వెనక్కు ఎనిమిదిమైళ్ళు వెళ్ళాలి! ఈ కుర్రవెధవ మీద జాలంతా, తనుపడే కష్టానికి సానుభూతేనని వెంకటేశ్వర్లుకు తెలియలేదు.

ఏ ప్రమాదమూ జరగకుండానే నానా అవస్థాపడి వెంకటేశ్వర్లు కొంపజేరాడు కనుకనే, ఆ తిరుపతి వెంకటేశ్వరస్వామి కరుణించాడనే నమ్మకం కలిగింది. ఇంటి ముందు రిక్షా ఆగినా వెంకటేశ్వర్లు వూపిరి అందనంతగా గాలి పీలుస్తూనే ఉన్నాడు. చెమట ధారలుగా కారుతోంది. అరికాల్లో బయలుదేరిన ఆవిర్లు మెదడుదాకా యెగతంతూన్నవి. శిలా ప్రతిమల్లే ఐదు నిమిషాలపాటు కూలబడ్డాక కాని వెంకటేశ్వర్లు మళ్ళీ మనిషవలేదు.

తను సురక్షితంగా బతికివున్నాడు; జేబు తడివి చూసుకున్నాక, తన డబ్బుకూడా సురక్షితంగావున్న ఆనందం కలిగింది. మరి న్యాయంగా సంపాయించే డబ్బుకు చలనం ఉండదని తనెన్నిసార్లు పెద్దలు చెప్పగా వినలేదు కనుక?

న్యాయం అనగానే యీ కుర్రవెధవకు తాను చేయదలుచుకున్న న్యాయం సంగతి గుర్తొచ్చింది. కాని ఐదు రూపాయిలు వీడికి ఇవ్వటానికి మనసొప్పటం లేదు. జీవితంలో మొదటిసారి అంతరాత్మ తిరుగుబాటుచేసి వెంకటేశ్వర్లును ఘోరంగా తూలనాడుతోంది. ఇప్పటికే అలసి చిరాగ్గా వుండటంవల్ల, అంతరాత్మతో రాజీకి దిగాడు.

రిక్షావాణ్ణి కదిపి, కేకవేశాడు. వాడు మెల్లిగా మూలిగి, లేచి కూర్చున్నాడు. చప్పున బండిలోంచి దూకాడు.

"ఎక్కండి—" అంటున్నాడు వాడు.

"అరేయ్ సుబ్బడూ! మా ఇంటికి వొచ్చేశాం కాని....ఈ ఐదూ తీసుకొని ఫో" అన్నాడు వెంకటేశ్వర్లు, ఐదురూపాయిల కాగితం అందిస్తూ; అంతరాత్మ వెంకటేశ్వర్లును నమ్మేస్థితిలో లేకుండటంవల్ల యీ పని తొందరగా చేయించింది.

రిక్షా కుర్రాడు చప్పున నోటు లాక్కున్నాడు. రిక్షాను చకచకా నెట్టుకుంటూ, కాస్త వేగం రాగానే ఎగిరి సీటుమీదికి దూకాడు. ప్రశాంతమైన రాత్రిని భంగపరుస్తూ, అదేపనిగా గంట వాయిస్తూ, తన సంతోషాన్ని ప్రకటించేందుకు రిక్షాను దూకిస్తున్నాడు,

'వెధవ! దొంగయెత్తు వేసి యీ దూరమంతా నాచేత తొక్కించాడు ....దొంగ వెధవ!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు. రిక్షా గంట వినపడేటంతవరకూ అలాగే నిర్జీవంగా నిలబడి పొయ్యాడతను. —మార్చి, 1955.